ఈనాడు
అన్నమయ్య

కిక్కెవరికో..? లక్కెవరికో?!



ఈనాడు, కడప

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో ఒక్క మద్యం దుకాణం దక్కినా చాలనే భావనతో మద్యం టెండర్ల దరఖాస్తులకు క్యూ కడుతున్నారు. ఈ అవకాశం దక్కించుకోవడానికి రాజకీయ నాయకుల నుంచి దళారుల వరకు ఎత్తుకుపైఎత్తులు వేస్తూ లాటరీ విధానం కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు దాఖలుకు 11వ తేదీ వరకు గడువు పెంచారు. వ్యాపార వాంఛ, రాజకీయ కాంక్షల మధ్యవర్తులు రాయబారాలు జరుపుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి.

● జిల్లాలో 111 దుకాణాలకు మంగళవారం రాత్రి వరకు 1,020 దరఖాస్తులు వచ్చాయి. కొన్నిచోట్ల దరఖాస్తులు వేయనీయకుండా కొందరు నేతలు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 14న మద్యం దుకాణాలను లాటరీ విధానంలో కేటాయించడానికి ఆబ్కారీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది. దరఖాస్తు చేసుకున్న వారికి ఎంట్రీ పాసులు జారీ చేసి లాటరీ కార్యక్రమానికి అనుమతిస్తారు. పట్టణ ప్రాంతాల్లో దుకాణాలకు వ్యాపారులు పోటీ పుడుతున్నారు. మదనపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు ప్రాంతాలకు ఎక్కువ మంది దరఖాస్తు చేయడానికి పోటీ పడ్డారు. కొన్ని చోట్ల రాజకీయ నేతల బెదిరింపులతో దరఖాస్తులు తక్కువ సంఖ్యలో దాఖలయ్యాయి. లాటరీలో దుకాణం దక్కించుకున్నా.. వ్యాపారం ఎలా చేస్తావో చూస్తామంటూ బెదిరింపులతో కొందరు వెనకడుగు వేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు అవకాశం ఉండడంతో కొందరు ధైర్యంగా గోప్యంగా దరఖాస్తు చేశారు. ఏ దుకాణానికి ఎవరు దాఖలు చేశారనే విషయం తెలుసుకునే విధానం లేకపోవడంతో నేతలు, ఔత్సాహిక వ్యాపారులు ఆసక్తిగా ఇతరుల ద్వారా దరఖాస్తుదారుల గురించి ఆరా తీస్తున్నారు. శుక్రవారం వరకు మరిన్ని దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉంది. అయిదేళ్ల తర్వాత అమల్లోకి వచ్చిన నూతన మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో మద్యం దుకాణం ఒక్కటి తగిలినా చాలు పరపతి పెంచుకోవచ్చనేది చాలా మంది భావన. ఆ అవకాశం దక్కించుకోవడానికి రాజకీయ నేతల నుంచి దిగువ స్థాయి దళారుల వరకు ప్రస్తుతం ఎత్తుకుపైఎత్తులు వేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని ఉద్యోగులు సైతం దుకాణాల కోసం పోటీపడుతున్నారు. కొందరైతే మద్యం దుకాణం ఉండడం స్టేటస్‌గా భావిస్తున్నారు. పరిమితి లేకపోవడంతో ఒక్కొక్కరు పదుల సంఖ్యలో దరఖాస్తులు దాఖలు చేస్తున్నారు. ఏదేని ఒకటైనా తగలకపోతుందా.. అనే భావనతో పోటీపడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం మద్యం దుకాణాలపైనే చర్చోప చర్చలు సాగుతున్నాయి. లైసెన్స్ ఫీజు 6 దఫాలుగా చెల్లించుకునే వెసులుబాటు ఉండడంతో పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల దాఖలుకు మరో రెండు రోజులు గడువు పెంచడంతో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.




రాజంపేటలో ప్రత్యేక అలంకరణలో సాధుకామాక్షమ్మ


రైల్వేకోడూరులో గౌరీదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి


నీరుగట్టువారిపల్లెలో శాకంబరిదేవిగా చౌడేశ్వరి దర్శనం


రాయచోటి వీరభద్రాలయంలో గజలక్ష్మీదేవి అలంకారంలో భద్రకాళీదేవి

మహాలక్ష్మీ... నమోస్తుతే!


మదపపల్లెలోని తూర్పుకొత్తపేటలో బొమ్మల కొలువు సందడి

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం జగన్మాత మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు... జిల్లావ్యాప్తంగా శక్తి స్వరూపిణి ఆలయాల్లో అమ్మవారు ఎర్రటి దుస్తుల్లో తేజోమయ రూపంతో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రుల్లో లక్ష్మీదేవిని పూజిస్తే ఆ తల్లి సర్వ మంగళకారిణిగా భాగ్యరాశులను కురిపిస్తుందని భక్తుల నమ్మిక. పంచభోగాలైన పాయసం, చక్రపొంగలి, లడ్డు, పులిహోర, దద్దోజనాలను అమ్మవారికి నివేదించారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదివ్య రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో చేసిన ప్రత్యేక అలంకారాల చిత్రాలివి.

- న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం


కలికిరిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అలంకరణలో పార్వతీదేవి

ఎదురింట్లో కుర్రాడు... పైగా సొంతూరి వాడే...
కుమారుడు దూరంగా ఉండడంతో అతడినే కుమారుడిలా నమ్మింది

అమ్మలా ప్రేమను పంచింది
అతనూ కొడుకులా ఉంటూ నమ్మించాడు


ఆకలైనప్పుడు అన్నం పెట్టింది
అతడు చేతికున్న బంగారు గాజులు చూశాడు

కష్టం వస్తే అయ్యో అని వగచింది
అతను ఆమె మెడలో నగలు చూశాడు

తల్లిలా మమతను పంచితే
అతనిలోని నరరూప రాక్షసుడు బలికోరాడు

ఆమె అనారోగ్యాన్ని బలహీనతగా గుర్తించాడు
మహత్తు ఉన్న స్వామి పేరిట నమ్మించాడు

నరకానికి తీసుకెళ్తున్నాడని తెలియక నమ్మి వెళ్లింది
మత్తు ఇచ్చాడు... సుత్తితో మోది హతమార్చాడు



నిందితుడు వెంకటేష్

- న్యూస్‌టుడే మదనపల్లె నేరవార్తలు


రోదిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్


పరారీలో ఉన్న అనిల్


అనుమానితురాలు రమాదేవి

నమ్మినవాడే నరరూప రాక్షసుడు!

మదనపల్లె పట్టణంలో సంచలనం సృష్టించిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తల్లి స్వర్ణకుమారి హత్యోదంతమిది. బిడ్డలా ఆదరించిన వ్యక్తే నిందితుడని తెలిసి అందరూ నివ్వెరపోవాల్సి వచ్చింది. ఈ ఘటన వెనుక వివరాలివి.

మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీకి చెందిన స్వర్ణకుమారి (62) కుమారుడు నాగేంద్రప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఒకటో పట్టణ సీఐగా పనిచేస్తున్నారు. పట్టణంలో సొంతిల్లు ఉండడంతో తల్లి ఒక్కతే ఇక్కడ ఉంటోంది. వీరిది కలికిరి మండలం మేడికుర్తి. కాగా అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అతని తల్లిదండ్రులు లక్ష్మమ్మ, సురేంద్ర కూడా మదనపల్లె పట్టణంలోని జగన్‌కాలనీలోనే నివాసం ఉంటున్నారు. స్వగ్రామం, పరిచయస్థులు కావడంతో వెంకటేష్ కుటుంబంతో ఆమె సన్నిహితంగా ఉంటోంది. తన కుమారుడు దూరంగా ఉండడంతో కొడుకు వయసున్న వెంకటేష్‌తో కావాల్సిన వస్తువులు తెప్పించుకునేది. అతను మాత్రం ఆమె నగలు కాజేయాలని పథకం వేసి తన స్నేహితుడైన నీరుగట్టువారిపల్లెలోని సాయిరాంవీధికి చెందిన అనిల్‌ను జత కలుపుకొన్నాడు. వీరిద్దరూ హత్యకు కుట్రపన్నారు. ఇందులో భాగంగా గత నెల 28న కాశీ నుంచి ఓ స్వామీజీ వచ్చాడని అతని వద్ద చూపించుకుంటే ఎలాంటి రోగాలైనా మటుమాయం అవుతాయని స్వర్ణకుమారిని నమ్మించారు. వారి మాటలు నమ్మి వెళ్లిన ఆమెకు నిద్రమాత్రలు కలిపి ఉన్న తీర్థాన్ని తాగించారు. ఆమె మత్తులో ఉండగానే సుత్తితో తలపై కొట్టి చంపేశారు. అనంతరం ఆమె వద్ద ఉన్న నగలు తీసుకుని స్థానికంగా ఉన్న ఓ ఫైనాన్స్ సంస్థలో కుదువ పెట్టి రూ.4.30 లక్షలు నగదు తీసుకున్నారు. తిరిగి వచ్చి గోనెసంచిలో ఆమె మృతదేహాన్ని ఉంచి అయోధ్యనగర్‌లోని శ్మశాన వాటికలో ఓ సమాధిని సగం తవ్వి అందులోనే పూడ్చేసి వెళ్లి పోయారు. స్వర్ణకుమారి కుమారుడు నాగేంద్ర ప్రసాద్ తల్లి కన్పించలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పది రోజుల పాటు ఇటు మదనపల్లె పోలీసులు అటు శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు సంయుక్తంగా విచారణ చేపట్టగా స్వర్ణకుమారితో సన్నిహితంగా మెలిగే వెంకటేషే నిందితుడని నిర్ధారణ అయింది. మంగళవారం అతన్ని అరెస్టు చేసి స్వర్ణకుమారిని పూడ్చిన శ్మశానానికి తీసుకెళ్లారు. అక్కడ గోనెసంచితో పూడ్చిన స్వర్ణకుమారి మృతదేహం బయటపడింది. ప్రభుత్వాసుపత్రి వైద్య బృందంతో ఘటనా స్థలంలోనే శవపరీక్ష నిర్వహించి అంత్యక్రియలు చేశారు.


స్వర్ణకుమారి మృతదేహం ఉన్న గోనెసంచి

కుమారుడిని పెంచి... ప్రయోజకుడిని చేసి: స్వర్ణకుమారి భర్త రెండో వివాహం చేసుకోవడంతో అతనితో విభేదించి చిన్నప్పుడే కుమారుడు నాగేంద్రప్రసాద్‌తో మదనపల్లెకు వచ్చి కష్టపడి చదివించారు. అలా కుమారుడు హాకీ క్రీడాకారుడిగా సత్తా చాటి బీటీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. క్రీడల కోటాలోనే ఎస్.ఐగా ఎంపికైన ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎక్కువ కాలం పనిచేసి ప్రస్తుతం సీఐగా ధర్మవరం ఒకటో పట్టణ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడితో కొన్నాళ్లు ఉండడం, సొంతిల్లు దెబ్బతింటుందని మదనపల్లెకు రావడం చేస్తుండేవారు. ఇంతలోనే నమ్మి ఆదరించిన వాడే నరరూప రాక్షసుడిగా మారి ఆమెను హతమార్చాడు. స్వర్ణకుమారి మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, నాగేంద్రప్రసాద్ స్నేహితులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు హాజరవ్వడంతో విషాదం అలముకుంది. ఇప్పటికి వెంకటేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనికి సహకరించిన అనీల్ పరారీలో ఉన్నాడు. హత్య జరిగిన రోజు అనీల్ తల్లి కూడా ఇంట్లోనే ఉండటంతో ఆమె కూడా సహకరించిందని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేస్తే నిందితులు ఇంకా ఏమైనా నేరాలు చేశారా? అని తెలిసే అవకాశం ఉంది. పరారీలో ఉన్న నిందితుడు అనిల్ కోసం ఓ బృందం గాలిస్తోందని అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

14 నుంచి జిల్లాలో 'పల్లె పండగ'


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా అధికారులు కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. పల్లె పండగను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఆగస్టు 23న జిల్లాలో నిర్వహించిన గ్రామసభల ద్వారా రూ.71 కోట్ల విలువైన పనులకు తీర్మానాలు చేశామన్నారు. ఇప్పటికే రూ.65 కోట్ల విలువైన పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేశామని ఆయన డిప్యూటీ సీఎంకు వివరించారు. పల్లె పండగ వారోత్సవాల్లో చేపట్టే భూమిపూజ, శంకుస్థాపనల్లో మంత్రులు, శాసన సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు అందరినీ భాగస్వాములు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్తు తయారీలో ప్రోత్సాహకాలు


మాట్లాడుతున్న ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ, పక్కన ఈఈ, డీఈలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రధాని సూర్యఘర్ యోజనలో భాగంగా ఇళ్లు, భవనాలపై 1 నుంచి 3 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సౌర పలకల ఏర్పాటుతో సంప్రదాయేతర విద్యుత్తు ఉత్పత్తికి ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఈఈ కార్యాలయంలో విద్యుత్తు ఇంజినీర్లు, ఈఆర్వోలతో సమీక్షించాక ఆయన మాట్లాడారు. కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేల రాయితీతో లబ్ధి ఉంటుందన్నారు. బ్యాంకుల్లో స్వల్ప వడ్డీలతో రుణాలకు అవకాశం ఉందన్నారు. వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా ఇవ్వాలని స్పష్టం చేశారు. వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ రమణారెడ్డి, డీఈలు శ్రీనివాసులురెడ్డి, శిరీష, ఏఈలు, ఈఆర్వో సిబ్బంది పాల్గొన్నారు.


సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్ఠంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. జిల్లాలో పెద్ద, మధ్య తరహా నీటి వినియోగదారుల సంఘాలు లేవన్నారు. చిన్న నీటిపారుదల కింద 164 సంఘాలు ఉన్నాయన్నారు. వాటిలో 94 సంఘాలు ఉమ్మడి కడప, 70 సంఘాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో ఉన్నాయన్నారు. వెలిగల్లు, అన్నమయ్య ప్రాజెక్టుల కింద నీటి వినియోగదారుల సంఘాలు లేవన్నారు. రాష్ట్రంలో నీటి పారుదల రంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ నెల 16 నుంచి నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. సంబంధిత షెడ్యూల్, నామినేషన్ పత్రాలను కలెక్టర్లకు పంపడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత రోజువారీ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నీటి వినియోగదారుల సంఘానికి ఆరుగురు ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోవాలన్నారు. వారి నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, జలవనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల విక్రయానికి ప్రత్యేక కౌంటర్లు

రాయచోటి, న్యూస్‌టుడే: పండగ సీజన్‌లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా వంట నూనెలు, నిత్యావసర సరకులు అందుబాటులోకి తీసుకొస్తామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా నూనెలు, నిత్యావసర సరకులు తక్కువ ధరలకు విక్రయిస్తామన్నారు. ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటుకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్, తూనికలు, కొలతల అధికారులను ఆదేశించారు. టమాట ధరలను రూ.50గా నిర్ణయించామన్నారు. పౌర సరఫరాల శాఖ డీఎం శివరాం, మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రఘురాం కొలతలు, తూనికల విభాగం అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

కస్తూర్బాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 43 బోధనేతర (నాన్‌టీచింగ్) సిబ్బంది పోస్టులను పొరుగుసేవల (ఔట్‌సోర్సింగ్) ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15లోగా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్ పోస్టులకు ఎటువంటి విద్యార్హత లేదని, డే, నైట్ వాచ్ ఉమెన్, చౌకీదార్ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివరాలకు apkgbv.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

30 ఏళ్ల సుదీర్ఘ పోరాటమే ఎస్సీ వర్గీకరణ

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు రవీంద్రమాదిగలు పేర్కొన్నారు. పట్టణంలోని బీహెచ్ రెసిడెన్సీలో వారు మాట్లాడారు. మాదిగ ఉప కులాల ఉజ్వల భవిష్యత్తు కోసం షెడ్యూలు కులాల వర్గీకరణ లక్ష్య సాధనకు మహాజన నేత మందకృష్ణమాదిగ పోరాటం సాగించారన్నారు. జాతి ఐక్యతను, ఉజ్వల భవిష్యత్తును, పేదవర్గాల హక్కుల సాధనకై చదువుకున్న విద్యావంతులు ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని పాత కమిటీలు రద్దు చేసి నూతన కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెస్పీ నాయకులు వెలగచర్ల శివయ్య మాదిగ, చిన్న, రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సి.వి.రమణ, సురేష్, వెంకటేష్, గండికోట వెంకటేష్, గురవయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ, పక్కన నాయకులు

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు రేపు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా అంత్యోదయ దివాస్ సందర్భంగా ఈ నెల 10న వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించనున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.రాజేష్ తెలిపారు. కడపలోని అప్సర కూడలి, బద్వేలు, లక్కిరెడ్డిపల్లె, సుండుపల్లి బస్టాండు ప్రాంతాల్లో, చిట్వేలి పరిధిలోని చక్రంపేట ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఈ నెల 10వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు.

డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కమలాకర్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప కేంద్ర కారాగారంలో డిప్యూటీ పర్యవేక్షణాధికారిగా పని చేస్తున్న జవహర్‌బాబును ఆకస్మికంగా వైజాగ్‌కు బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న కమలాకర్‌ను కడపలో నియమించారు. జైలు అధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ వైజాగ్‌లో ఖైదీల సంఖ్య ఎక్కువగా ఉండడంతో జవహర్‌బాబును అక్కడికి బదిలీ చేశారని పేర్కొన్నారు.

ఏరువాక... జోరుగా సాగుగాక!


పత్తి పంటపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నూతన వంగడాల సాగులో విజయం

అన్నదాతకు అండగా శాస్త్రవేత్తలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : ఆరుతడి పంటలు సాగు చేస్తూ ఏటా నష్టాలు మూటగట్టుకుంటున్న అన్నదాతలకు అద్భుత ఫలితాలు అందించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. వ్యవసాయ పరిశోధనలే సవాలుగా వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. సాగులో నూతన పద్ధతులు, కొత్త వంగడాలపై ప్రయోగాలు, ఏ పంటలు వేయాలి, ఎలాంటి మందులు వాడాలి, దిగుబడి ఎలా పెంచుకోవాలి, తదితర విజ్ఞానాన్ని రైతులకు చేర వేస్తున్నారు. వారి కృషికి ఎన్నో పురస్కారాలు లభించాయి. వీటన్నింటికి వేదికగా కర్షకులకు అండగా నిలుస్తోంది సీకేదిన్నెలోని ఏరువాక కేంద్రం.

300కు పైగా క్షేత్ర ప్రదర్శనలు

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 300కు పైగా వివిధ పంటల్లో క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించారు. చీడపీడల నివారణ, పంటల యాజమాన్యంలో కొత్త పద్ధతులను రైతులకు పరిచయం చేయడంతో పాటు నూతన వంగడాలు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నారు. వరిలో ఎన్‌డీఎల్ఆర్-9, ఎన్ఎల్ఆర్-15048, 40054, 34449, 3041, 20084, 3083 ఎంసీఎం-105, బీపీటీ-3042, కందిలో ఎల్ఆర్‌జీ-41, 105, టీఆర్‌జీ-22, శనగలో ఎన్‌బీఈజీ-776, మినుములో ఎన్‌బీజీ-904, పెసరలో ఎల్‌జీజీ-607, 630, జొన్నలో ఎన్‌టీజే-5, రాగిలో వకుళ, కొర్రలో గరుడ, సూర్యనంది, మహానంది రకాలను రైతులకు పరిచయం చేశారు.

500 శిక్షణ కార్యక్రమాలు

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో 500 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనుబంధ శాఖలతో రైతులకు 250, వ్యవసాయ విస్తరణ అధికారులకు 100 శిక్షణలిచ్చారు. జిల్లాలో పరిశీలన బృందాలతో కలిసి 1,500 పంటలు పరిశీలించారు. తిరుపతి వ్యవసాయ కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ అనుభవ పథకం కింద శిక్షణ అందించారు.

సాంకేతిక పరిజ్ఞానం అందించారు

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పంటల సాగుపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కొత్త రకాల విత్తనాలు తమకు ఇచ్చి సాగు చేయించారు. ఏ సమయానికి మందులు వాడాలి, ఎంత ఎరువులు వేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. పెసర పంట సాగు చేయగా ఆరు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చి మంచి ఆదాయం పొందాను. యాజమాన్య పద్ధతులు పాటించడంతోనే అధిక దిగుబడి వచ్చింది. **- మాధవరెడ్డి, రైతు, లింగాయపల్లె, వల్లూరు మండలం**

సేంద్రియ పద్ధతిలో సాగు

సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేశాను. ఏరువాక శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు వరి, పత్తి, రాగి, జొన్న, కొర్ర వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులు చేపట్టాను. కొత్త రకాలు కావడంతో శాస్త్రవేత్తల సూచనలతోనే సేంద్రియ ఎరువులు వాడాను. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు తోడుగా నిలుస్తున్నారు. రసాయనిక మందులు వాడడం తగ్గించి సేంద్రియ ఎరువులు వేస్తున్నాం. **- కృష్ణమూర్తి, రైతు, మామిళ్లపల్లె, మైదుకూరు**

లాభసాటిగా మార్చడమే లక్ష్యం

రైతులకు ఆధునిక సాంకేతిక పద్ధతులను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా ఏరువాక కేంద్రం కృషి చేస్తుంది. జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. రైతులు జాగ్రత్తగా సాగును ఎంచుకోవాల్సిన అవసరం ఉంది. వాతావరణానికి అనువైన పంటలనే సాగు చేయాలి. నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలి. తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యమివ్వాలి. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించే వరి, పెసర, రాగి, మినుము, కొర్ర తదితర వంగడాలను రైతుల పొలాల్లో సాగు చేయించి వాటి ఫలితాలను విశ్వవిద్యాలయానికి అందిస్తున్నాం. జిల్లాలో మంచి ఫలితాలు వస్తున్నాయి. **- అంకయ్యకుమార్, ఏరువాక కేంద్రం, సమన్వయకర్త**


రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో సత్తా

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఈ నెల 4 నుంచి 6 వరకు జరిగిన క్రీడాపోటీల్లో మదనపల్లెలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. రాష్ట్రస్థాయి 400 మీటర్ల మిక్స్‌డ్ రిలే పరుగులో మనోజ్, రుచిత, గాయత్రి రజత పతకాలు సాధించారన్నారు. విజేతలను ప్రిన్సిపల్ రమాదేవి, పీడీలు శరత్ నాయక్, జగదీష్ అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి, తదితరులు

యోగాసనాలతో మానసిక వికాసం

రాయచోటి, న్యూస్‌టుడే: యోగాసనాలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ఆల్‌ఇండియా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణదేవరాయలు పేర్కొన్నారు. పట్టణంలోని మాసాపేట ఓ కల్యాణ మండపంలో మంగళవారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు ప్రారంభించారు. మానసిక ఒత్తిడి తగ్గడమే కాకుండా ఆరోగ్యవంతులుగా ఉండేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జ్ఞాపక శక్తిని పెంపొందించిస్తుందన్నారు. జిల్లా స్థాయి పోటీలకు 60 మంది యోగాసాధకులు హాజరు కాగా 16 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గెలుపొందిన వారు ఈ నెల 26వ తేదీ నంద్యాలలో జరిగే పోటీలకు వెళ్తారన్నారు. అనంతరం యోగాసనాలు, వాటి ప్రయోజనాలపై ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఎన్.తులసిరెడ్డి, యోగా మాస్టర్లు కొత్త సుదర్శన్ పాల్గొన్నారు.


యోగా పోటీల్లో పాల్గొన్న స్థానికులు

విద్యార్థులకు ఇస్రో స్పేస్ వీక్ సర్టిఫికెట్లు ప్రదానం

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న వరల్డ్ స్పేస్ వీక్-2024 కార్యక్రమం ఉత్సాహంగా సాగుతుంది. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే ఆలోచనా విధానాన్ని పెంపొందించడం, పరిశోధనల వైపు అడుగులేయాలనే లక్ష్యంతో ఇస్రో సహకారంతో స్పేస్ - వెదర్ ఛేంజ్ అనే థీమ్ అనే థీమ్‌తో ఈ కార్యక్రమం ఏర్పాటుచేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి విద్యార్థులు హాజరై వివిధ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి డీఈవో అనురాధా, నోడల్ అధికారి వి.రమణయ్య, ఇస్రో జనరల్ మేనేజర్ ఎ.బాలమురళి, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.రెడ్డయ్యలు ధ్రువపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, వీపీ టీఎన్ ప్రసాద్, వీరశంకర్, సురేష్‌బాబు, కమిటీ మెంబర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈవో అనురాధా, ఇస్రో ప్రతినిధులు

వినియోగానికి మీనమేషాలు

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు వారపు సంత మార్గంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన మత్స్య విక్రయకేంద్రం పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. రూ.7.50 లక్షల వ్యయంతో 2012లో సీఎంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నప్పుడు ఈ భవనం నిర్మించారు. ఇందులో కొన్నాళ్లు చేపల విక్రయదారులు వ్యాపారం చేసినా తరువాత సౌకర్యంగా లేదని వదిలేశారు. తరువాత కొన్నాళ్లు చిత్తూరు మార్గం బస్సు మార్గం పక్కన విక్రయాలు చేసినా మూడేళ్ల కిందట నుంచి ఆర్టీసీ బస్టాండు పక్కనున్న వారపుసంతలో ఎనిమిది మంది చేపల విక్రయదారులు రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం రూ.7.50 లక్షలతో నిర్మించిన మత్స్య విక్రయకేంద్రం నిరుపయోగంగా మారింది. అధికారులు ఇతర శాఖలకు ఇస్తే కొంత వరకు భవనం నిర్మించిన ఉద్దేశం నెరవేరుతుందని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, పీలేరు**



హార్సిలీహిల్స్‌లో కలెక్టర్ పర్యటన

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు కలెక్టరు చామకూరి శ్రీధర్ సోమవారం రాత్రి వచ్చారు. కొండపై ఉన్న గవర్నరు బంగ్లాలో బస చేసిన ఆయన మంగళవారం ఉదయం రాయచోటికి బయలుదేరి వెళ్లారు. వ్యక్తిగత పర్యటనలో భాగంగా కుటుంబంతో కలిసి హార్సిలీహిల్స్‌లో పర్యటించినట్లు అధికారులు వెల్లడించారు.

అంతర్జాతీయ బాలిక దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు

రాయచోటి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని డీఈవో శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యాస రచన, పెయింటింగ్, డిబేట్ వంటి పోటీలను నిర్వహిస్తామన్నారు. విద్యార్థులల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందించడంలో తోడ్పడే విధంగా ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. వ్యాసరచన పోటీలలో 'ఆడ పిల్లలను రక్షణ.. ప్రాముఖ్యత' అనే అంశంపై ఉంటుందన్నారు. పెయింటింగ్‌లో ప్రతి ఆడపిల్లకి భవిష్యత్తు అనే అంశం.. డిబేట్‌లో ఆడపిల్లల రక్షణ, పెరుగుదలను నివారించడంలో సమాజం పాత్ర అనే అంశాలపై తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ మీడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాల కోసం అసదుల్లా డైట్ అధ్యాపకుడు 9440084715 చరవాణి నెంబరును సంప్రదించాలన్నారు.

కువైట్‌లో మండల వాసి హత్య


వీరాంజనేయులు (పాత చిత్రం)

సుండుపల్లి, న్యూస్‌టుడే: జీవనోపాధి నిమిత్తం పదేళ్ల కిందట కువైట్‌కు వెళ్లిన వ్యక్తి హత్యకు గురైనట్లు సమాచారం అందిందని మృతుడి కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. గడ్డమీదపల్లి ఎరుకల కాలనీకి చెందిన కప్పం వీరాంజనేయులు (45) నాలుగేళ్ల కిందట తన భార్య చెన్నకేశవమ్మను కువైట్‌కు తీసుకెళ్లారు. వారిద్దరూ అక్కడే ఓ ఇంట్లో పని చేస్తుండేవారు. ఈ క్రమంలో పది రోజుల కిందట వారుంటున్న నివాసంలో ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఆమెను శుక్రవారం మరో ఇంటికి పంపారు. మూడు రోజులకు వీరాంజనేయులును ఎడారిలోకి తీసుకెళ్లి హత్య చేశారనే విషయం సోమవారం ఆమెకు తెలియడంతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం మంగళవారం తమకు అందిందని మృతుడి బంధువులు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి యువకుడి మృతి


హేమంత్‌కుమార్ (పాతచిత్రం)

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లెలో మంగళవారం జరిగింది. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు ఆనంద్, సుమతి దంపతుల కుమారుడు హేమంత్‌కుమార్ (20) బెంగళూరులోని ఓ కంపెనీలో పని చేసేవారు. ఈ నెల 6వ తేదీన అతడు బెంగళూరులోని తన అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లడంతో వైద్యులు ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు హేమంత్‌కుమార్‌ను మదనపల్లెకు తీసుకొచ్చి ప్రభుత్వాసుపత్రి ఐసీయూలో చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శవాగారానికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని బెంగళూరు పోలీసులకు తెలియజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

రేణిగుంట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రేణిగుంట పట్టణ పోలీసుల కథనం మేరకు... రైల్వేకోడూరుకు చెందిన బలరామరాజు (55) సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో రేణిగుంట వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బలరామరాజును చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం రేణిగుంట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గడ్డిమందు తాగి రైతు కూలీ ఆత్మహత్య

రాజంపేట గ్రామీణ : రాజంపేట మండలం మందరం కొత్తపల్లికి చెందిన రైతు కూలీ నారాయణ (45)అనే వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. కుటుంబ సమస్యల కారణంగా బలవన్మరణానికి పాల్పడినట్లు వారు వివరించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

తహసీల్దారు ఎదుట నిందితుల బైండోవర్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : వినాయక చవితి వేడుకల్లో మాజీ సీఎం జగన్‌ను పొగుడుతూ పాటలకు నృత్యాలు చేసిన కేసులో నిందితులను బి.కొత్తకోట బాధ్య తహసీల్దారు మహమ్మద్ అన్సారీ ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు స్థానిక సీఐ రాజారెడ్డి తెలిపారు. గత నెల 13న రాత్రి స్థానిక పోకనాటివీధి నుంచి వినాయకుడి ఊరేగింపు ప్రారంభమై వివిధ ప్రాంతాల మీదుగా కొనసాగింది. వినాయకుడి ఊరేగింపునకు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌లో కొందరు మాజీ సీఎం జగన్‌కు మద్దతుగా పాటలు వేయడంతో పాటు వైకాపా జెండాలు ప్రదర్శించారు. ఈ విషయంపై స్థానికుల నుంచి ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తొలుత తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మరో 24 మందిని నిందితులుగా చేర్చారు. తాజాగా ఈ కేసులో నిందితులకు ముందస్తుగా నోటీసులు జారీ చేసి 24 మందిని స్థానిక తహసీల్దారు ఎదుట హాజరుపర్చారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లుగా సీఐ వివరించారు.

కల్వర్టు... కూలేట్టు

కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉంది... అధికారులు.. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోతే పెను ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయని చీకలబైలు పంచాయతీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని, ఈ పంచాయతీ పరధిలో బార్లపల్లె నుంచి రాగిమాకులపల్లెకు వెళ్లే మార్గంలోని బాహుదా నది కాలువపై కొన్నేళ్ల కిందట నిర్మించిన కల్వర్టు నాలుగేళ్ల కిందట కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రహదారులు, భవనాలశాఖ అధికారులు తాత్కాలికంగా సిమెంట్ పైపులతో మట్టిపరిచి రహదారిని క్రమబద్ధీకరించారు. గత మూడేళ్లుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ కాలువపై నిర్మించిన తాత్కాలిక మట్టి వంతెన కుంగిపోతూ వస్తోంది. ప్రస్తుతం ప్రమాదస్థాయిలో ఉంది. విస్తృతంగా వర్షాలు కురిస్తే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామీణ ప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంతో ఇక్కడ వంతెన నిర్మాణానికి అధికారులు పలుమార్లు ప్రతిపాదలను పంపినప్పటికీ పనులకు నిధులు మంజూరు కాలేదు. దీనిపై సర్పంచి ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళ్లామని నిధులు మంజూరు కాగానే కల్వర్టు నిర్మించి గ్రామీణులకు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ**



వైవీయూలో నూతన నియామకాలు చేపట్టాలి

కడప విద్య : వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) వైస్‌ఛాన్స్‌లర్ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ రాంప్రసాద్‌రెడ్డిలను వెంటనే తొలగించాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్ డిమాండ్‌చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ వైవీయూకు రాష్ట్రంలో గౌరవమైన గుర్తింపు ఉందన్నారు. ఈ నియామకాలతో ప్రతిష్ఠ దిగజారుతోందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా తరలింపు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గుండ్లూరు సమీపంలోని చెయ్యేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను రాజంపేటకు తరలిస్తున్నారు. గతంలో కంటే ఇసుక తక్కువ ధరకు అందించాలని కూటమి ప్రభుత్వం భావించిన అధికారులు తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. అనుమతులు లేకుండా చెయ్యేరు నుంచి ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు చెబుతున్నా.. అక్రమార్కులు మాత్రం తరలిస్తూనే ఉన్నారు. రాజంపేట పట్టణానికి ట్రాక్టర్ ఇసుక తరలిస్తే ఖర్చులన్నీ పోనూ రూ.నాలుగు వేలు సొమ్ము చేసుకుంటున్నారు. చెయ్యేరు నది ప్రాంతాలైన మందరం, నారాయణనెల్లూరు, మదనగోపాలపురం, తాళ్లపాక, శేషమాంబపురం, పాపరాజుపల్లి, నందలూరు, ఆడపూరు పరిసరాల్లో నిత్యం ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.


గుండ్లూరు సమీపంలోని చెయ్యేరులో వాహనాల టైర్ల గుర్తులు

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

జడ్పీ ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ నిధులు

మదనపల్లి విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పీఎంశ్రీ కింద ఎంపిక చేసి ఏడాదికి రూ.1.50 లక్షల నిధులు విడుదల చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి తెలిపారు. [illegible] పీఎంశ్రీ కింద నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యుత్తు ఛార్జీలు, [illegible] నిర్మాణం, నీటిశుద్ధి యంత్రం నిర్మాణం, తదితర వాటికి వినియోగిస్తామన్నారు. మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూడా పీఎంశ్రీ కింద ఎంపికైందన్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఏడాదికి రూ.లక్ష నిధులు విడుదలైనట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకం కింద నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువులోని ఉమాశంకర్‌కాలనీకి వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభానికి తీగలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులు, వాహనదారులు వెళుతుంటారు. కంచె రోడ్డు పక్కనే ఉండటంతో తీగలు అల్లుకున్నాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి తీగలు తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

[illegible]



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : సామాన్యుడికి కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. నిత్యావసర సరకులతో పాటు కూరగాయల ధరలు వినియోగదారులకు ఆర్థిక భారమయ్యాయి. మార్కెట్‌కు వెళ్లి కిలో కొనుగోలు చేయాలనుకునే వారు పావుకిలోతోనే సరిపెట్టుకుంటున్నారు. ఎన్నడూలేని విధంగా మదనపల్లె దినసరి మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పంట దిగుబడులు తగ్గడంతో వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోంది. ధరలు ఎప్పుడు తగ్గుముఖం పడతాయా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

◆ మదనపల్లె పరిసర ప్రాంతాల్లో ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఈ నేపథ్యంలో వరి, వేరుసెనగ వంటి పంటలతో పాటు కూరగాయల పంటలు సాగు చేస్తుంటారు. గత 15 ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు సాంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలికి వాణిజ్య పంటల సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటసాగు గణనీయంగా పడిపోయింది. నీటి ఆధారం లేక అయిదెకరాలు సాగు చేసే రైతు రెండెకరాల్లో పంట సాగు చేస్తున్నారు.



చిత్తూరు బస్టాండు సమీపంలోని కూరగాయల మార్కెట్

రోజుకు 400 టన్నుల దిగుబడి: మదనపల్లె పట్టణం వారపుసంత కేంద్రంగా కూరగాయల వ్యాపారం సాగుతోంది. స్థానిక రైతులు పండించే టమాట, వంగ, బీర, కాకర, బెండ తదితర కూరగాయలతో పాటు కర్ణాటక నుంచి క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్, మునగ, అనంతపురం నుంచి అలసంద, కాకర, గుమ్మడి, బీన్స్, గోరుచిక్కుడు వంటి వాటిని ఇక్కడి వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. రోజుకు 400 టన్నుల కూరగాయాలను దిగుమతి చేసుకుంటుండగా, ప్రస్తుతం 150 టన్నుల వరకు మాత్రమే మార్కెట్‌కు వస్తున్నాయి. సాగు విస్తీర్ణం తగ్గడం, పంటకు తెగులు సోకడంతో దిగుబడులు తగ్గినట్లు రైతులు చెబుతున్నారు.

టమాట రూ.90, తెల్లగడ్డలు రూ.500

ప్రస్తుతం మదనపల్లెలో కిలో టమాటా రూ.90 ధర పలుకుతోంది. దసరా పండుగకు ఇది రూ.100కు పెరగొచ్చని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం మదనపల్లె మార్కెట్‌యార్డుకు నిత్యం వంద మెట్రిక్ టన్నుల టమాటాలు మాత్రమే వస్తున్నాయి. డిమాండుకు తగ్గట్టుగా సరకు రాకపోవడంతో ధర పెరిగిందని అధికారులు చెబుతున్నారు. తెల్లగడ్డల ధర సామాన్యుడికి అందనంత దూరంలో ఉంది. కిలో రూ.500 వరకు పలుకుతోంది. ఇంతధర పెట్టి కొనుగోలు చేయలేక పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎర్రగడ్డలు, తెల్లగడ్డల ఎగుమతులు పెరగడంతోనే ఇక్కడ ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. తెల్లరకం బీన్స్, ముల్లంగి, క్యారెట్, గోరుచిక్కుడు, బెండ, కాకర, వంగ వంటి ఏ కూరగాయ కొన్నా దినసరి మార్కెట్‌లో కిలో రూ.100 పలుకుతోంది. దసరా పండుగ ఈ నెల 13వ తేదీ రానుంది. పండుగ రోజున ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



శాంతమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి

అన్నమయ్య, న్యూస్‌టుడే, ములకలచెరువు న్యూస్‌టుడే : తంబళ్లపల్లె మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, కోసువారిపల్లి తెదేపా నేత కృష్ణమూర్తి కుటుంబాలను మంగళవారం తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి పరామర్శించారు. కృష్ణమూర్తినాయుడు తల్లి శాంతమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జయచంద్రారెడ్డి మంగళవారం కూటమి నాయకులతో కలిసి శాంతమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. ◆ కోసువారిపల్లి తెదేపా నేత కృష్ణమూర్తి కుమారుడు నాగేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు తులసీధర్ నాయుడు, సోముశేఖర్, బేరి శీనా, పురుషోత్తం, జయరాంరెడ్డి, శివారెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

సంఘమిత్ర అక్రమాలపై విచారణ



దస్త్రాలు తనిఖీ చేస్తున్న అధికారులు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : మండల మహిళా సమాఖ్య పొతబోలు పంచాయతీ సంఘమిత్ర పుణ్యవతిపై మంగళవారం డీఆర్‌డీఏ అధికారులు విచారణ చేపట్టారు. పొతబోలు పంచాయతీ పరిధిలోని మహిళా సంఘాలకు సంబంధించిన సంఘమిత్రపై గత నెల 30న విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడుకు కొందరు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారించి నివేదిక ఇవ్వాలని డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించడంతో మంగళవారం డీపీఎం ఫైనాన్స్ ప్రసాద్‌రెడ్డి, శ్రీనిధి ఏజీఎం ఉదయ్‌కుమార్, శ్రీనిధి మేనేజర్ హేమంత్‌రెడ్డి, డీజీఎం మధుబాబు, ఏపీఎం సుబ్రమణ్యం విచారణ చేపట్టారు. గ్రూప్‌లోని సభ్యులకు సంబంధించిన డబ్బులను సక్రమంగా చెల్లించడం లేదని, సకాలంలో బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడం లేదని, గ్రూపులకు ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తున్న సున్నావడ్డీ, రాయితీలు, బ్యాంకు లింకేజీ రుణాలు అందడం లేదని, దీనిపై ప్రశ్నిస్తే దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. గత వైకాపా పాలనలో కొందరు అధికారులతో కలిసి రూ.లక్షల్లో అక్రమాలకు పాల్పడినట్లు తెలిపారు. మండల ఎంఎస్‌జీ సమావేశాలకు నకిలీ రికార్డులతో తారుమారు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై అధికారులు పంచాయతీ కేంద్రంలో సంఘమిత్ర వద్ద ఉన్న గ్రూపు సభ్యుల దస్త్రాల తనిఖీ చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

స్పందనకు వందనం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే : పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో నాగరాజు హెచ్చరించారు. మంగళవారం 'ఈనాడు'లో 'జలవనరులు కలుషితం..పారిశుద్ధ్యం అధ్వానం' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై డీఎల్‌పీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని చెరువులను పర్యవేక్షించాలని, ఎవరైనా చెత్తాచెదారం వేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటా చెత్తసేకరణ క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత సమయంలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నిలయంగా మారే అవకాశం ఉందన్నారు. తాగునీటి పైపులు ఎప్పటికప్పుడు తనిఖీ చేసి లీకేజీ లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. చౌడేపల్లె మండలం చౌడగుట్టపల్లెకు చెందిన జయప్రకాష్ (23) అయ్యప్ప దీక్ష చేపట్టారు. మంగళవారం సదుంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మొక్కు తీర్చుకునేందుకు తన సోదరి స్వాతి (19), బామ్మర్ది విక్కి (9)తో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా సింగిరిగుంట మలుపులో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన వారిని వెనుకనే మరో వాహనంలో వస్తున్న కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని చౌడేపల్లె పోలీసులకు తెలియజేశారు.

నిప్పంటుకుని వృద్ధురాలికి...

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : నిప్పంటుకుని వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కోళ్లబైలు పంచాయతీ జగన్‌కాలనీకి చెందిన వృద్ధురాలు లక్ష్మీదేవి (68) అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. సోమవారం రాత్రి మంచానికి సమీపంలో వెలిగించిన దీపం ప్రమాదవశాత్తు చీరకు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామీణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

దంపతుల అదృశ్యంపై కేసు నమోదు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : భార్యభర్తలు అదృశ్యమైన సంఘటన మంగళవారం పీలేరులో చోటు చేసుకుంది. సీఐ యుగంధర్ కథనం మేరకు.. పీలేరు పట్టణం బండ్లవంకకు చెందిన రెడ్డిశేఖర్ (38) సూపర్ మార్కెట్లకు సరకులు సరఫరా చేసే ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయనతో పాటు ఆయన భార్య దీప (30) సోమవారం ఉదయం నుంచి ఇంటికి తాళం వేసి కనిపించకుండా పోయారు. ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో రెడ్డిశేఖర్ తండ్రి పొత్తూరి రెడ్డెప్పనాయుడు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతుల అదృశ్యంపై ఫిర్యాదు

నిమ్మనపల్లె: నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లెలోని రెండు గ్రామాలకు చెందిన యువతులు అదృశ్యమైనట్లు కేసులు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుళ్లు శివరామకృష్ణయ్య, రమేష్ బాబు తెలిపారు. యువతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసులు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

మదనపల్లె నేరవార్తలు: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రెండోపట్టణ స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని శేషప్పతోటకు చెందిన యువతి (19) తల్లిదండ్రులు కిరాణా దుకాణం నిర్వహించేవారు. గత నెల 20న యువతి, కుటుంబ సభ్యులు దుకాణానికి వెళ్లారు. ఉదయం 9.30గంటలకు ఇంటికి వెళ్లి భోజనం చేసి వస్తానని చెప్పి వెళ్లిన యువతి కన్పించకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం రెండోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

సుకన్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



తలపులలో మహిళకు పథకం పత్రాన్ని అందిస్తున్న పోస్టుమాస్టరు రహీమున్నిసా

పీలేరు, న్యూస్‌టుడే : తపాలాశాఖలో బాలికలకు అమలు చేస్తున్న సుకన్య పథకంలో రెండు గ్రామాలు వందశాతం లక్ష్యాలు సాధించాయని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తపాలా సిబ్బందితో కలిసి పీలేరు మండలం తలపుల, కంభంవారిపల్లె మండలం గర్నిమిట్ట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలకు ప్రత్యేకంగా తపాలా కార్యాలయాల్లో సుకన్య పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకంలో బాలికలకు అయిదేళ్ల నుంచి 18 ఏళ్ల వరకు క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లిస్తే గడువు తీరిన తర్వాత మొత్తం నగదును ఖాతాదారులకు ఇస్తామన్నారు. తలపులలో 144, గర్నిమిట్టలో 142 ఖాతాలు పూర్తి చేసి వందశాతం లక్ష్యాలు సాధించాయన్నారు.

కాలువ నిర్మించి మురుగు సమస్య పరిష్కరిస్తాం

కలికిరి, న్యూస్‌టుడే : కలికిరి బీడీకాలనీ రెండో వీధిలోని మార్గంపై ఇళ్లలోని మురుగు ప్రవహించి పారిశుద్ధ్యం లోపిస్తోంది. స్థానికులు ఈ విషయాన్ని అభివృద్ధి కమిటీ సభ్యుడు యోగేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఈవో అశోక్‌తో కలిసి మురుగు ప్రవహిస్తున్న ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మురుగు కాలువ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు.



కలికిరి బీడీ కాలనీ రెండో వీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

జగజ్జననీ... పాహిమాం



రామసముద్రంలో పుష్పాలంకరణలో మారెమ్మ




కేవీపల్లి మండలం చీనేపల్లెలో మహాలక్ష్మీగా చౌడమ్మ

దసరా ఉత్సవాలు మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలలో వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అన్ని ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. **- న్యూస్‌టుడే బృందం.**



నిమ్మనపల్లెలో గాజుల అలంకరణలో మాతమ్మ



పీలేరులో రాజరాజేశ్వరీదేవిగా కన్యకాపరమేశ్వరి



గుర్రంకొండలోని రెడ్డెమ్మ ఆలయంలో త్రిపురసుందరిగా...



కురబలకోటలో అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి



మహాలక్ష్మీ అలంకరణలో కలికిరి ఎల్లమ్మ



ములకలచెరువులో నాగదేవత అలంకరణలో...



బి.కొత్తకోటలోని కాళికామాత ఆలయంలో...

బి.కొత్తకోట ఉప తహసీల్దారుకు అదనపు బాధ్యతలు

బి.కొత్తకోట: బి.కొత్తకోట ఉప తహసీల్దారు మహమ్మద్ అన్సారికి తహసీల్దారుగా పూర్తిస్థాయిలో అదనపు బాధ్యతలు అప్పగించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన బదిలీల్లో బి.కొత్తకోటకు శ్రీధర్‌ను నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టిన నెల రోజుల వ్యవధిలోనే బదిలీపై వైయస్ఆర్ జిల్లాకు వెళ్లారు. అనంతరం రాయచోటి కలెక్టరేట్ నుంచి నరేంద్రకుమార్‌ను తహసీల్దారుగా నియమించగా ఆయన విధుల్లో చేరలేదు. దీంతో ప్రస్తుతం ఉప తహసీల్దారుగా ఉన్న మహమ్మద్ అన్సారికి తహసీల్దారుగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టరు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.


వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ తీగలు చోరీ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం వేమిలేటికోట పంచాయతీ అచ్చమ్మకోట సమీపంలోని వ్యవసాయబోర్ల నుంచి కేబుల్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అపహరించారు. ఈ మేరకు రైతు దేవరింటి కుమార్ మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్చమ్మకోట తాగునీటి పథకం వద్ద బోరు మోటారుకు ఉన్న తీగలను చోరీ చేయడంతో నీటి సరఫరా ఆగిపోయినట్లు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బోరు మోటార్ల నుంచి తీగలను దుండగులు అపహరించుకుని వెళ్లిపోయారు. కేబుల్ తీగల దొంగలను పట్టుకుని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆవుల చోరీ కేసులో నిందితుల అరెస్టు

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : ఆవుల చోరీ కేసులో కంభంవారిపల్లె పంచాయతీ లక్ష్మిరెడ్డిగారిపల్లెకు చెందిన ఖాజా, పీలేరుకు చెందిన సలీనను మంగళవారం అరెస్టు చేసి మూడు ఆవులు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ లక్ష్మీదేవి తెలిపారు. ఖాజా ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. వ్యసనాలకు గురై, చిన్న చిన్న చోరీలు చేసేవాడు. పీలేరుకు చెందిన సలీనతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇటీవల మూడు ఆవులను దొంగలించి విక్రయించారు. ఆవుల విలువ రూ.2,75,000 ఉంటుందని పేర్కొన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం గర్నిమిట్టకు సమీపంలో నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం... గోడలకే పరిమితం



కలికిరి మండలం పత్తేగడ పంచాయతీ కొటాలలో ఏడాది కిందట వైకాపా హయాంలో మంజూరైన అంగన్‌వాడీ కేంద్ర భవనం గోడలకే పరిమితమైంది. రూ.10 లక్షల అంచనాతో చేపట్టిన పనులు గోడల దశలోనే ఆగిపోయాయి. అసంపూర్తిగా ఆగిన అంగన్‌వాడీ కేంద్రం పూర్తి చేసేందుకు నిధులు విడుదలలో జాప్యం కారణంగా గుత్తేదారుడు పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీంతో అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విషయమై వాల్మీకిపురం ఐసీడీసీ సీడీపీవో భారతిని వివరణ కోరగా అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని, నిధులు మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కొటాల(కలికిరి)**

క్రీడాభివృద్ధికి సహకరించాలని వినతి



క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ రవినాయుడిని కలిసిన మల్లికార్జున్ నాయుడు, షేక్ అయూబ్‌బాషా

ముదివేడు (కురబలకోట), న్యూస్‌టుడే : తంబళ్లపల్లె నియోజకవర్గంలోని వివిధ విభాగాల్లో సామర్థ్యం కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తగిన సహకారం అందించాలని నియోజకవర్గ సమన్వయకర్త మల్లికార్జున నాయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అయూబ్‌బాషా విజ్ఞప్తి చేశారు. క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ రవినాయుడిని మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. తెదేపా నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో క్రీడా మైదానం ఎక్కడా లేదని, దీంతో అంగళ్లులో స్టేడియం ఏర్పాటు చేస్తే, ఆరు మండలాలకు కలిసి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నియోజకవర్గ పర్యటనకు రావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.

భూ బాధితులకు ఉప ముఖ్యమంత్రి అండ

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : గుర్రంకొండ మండలంలోని నడింకండ్రిగ పంచాయతీ పేరంపల్లె భూ బాధితులకు అండగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలిచారని పీలేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్ పేర్కొన్నారు. భూ బాధితులు మంగళవారం కలెక్టరు శ్రీధర్‌ను కలిశారు. ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో వారి సమస్యలు విన్న కలెక్టర్ పేరంపల్లె భూబాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

బిల్లు భారం తగ్గించేందుకే సౌర విద్యుత్తు పథకం

అంగళ్లు (కురబలకోట), న్యూస్‌టుడే : విద్యుత్తు బిల్లు భారం తగ్గించేందుకే కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుత్తు పథకాన్ని తీసుకొచ్చిందని హైదరాబాద్‌కు చెందిన ఫ్రేయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజీఎం ముత్యాల వంశీకృష్ణ తెలిపారు. మిట్స్ కళాశాల ఆవరణలో సోలార్ ఎనర్జీపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సౌర విద్యుత్తు సామర్థ్యంలో భారతదేశం నాలుగో స్థానంలో ఉందన్నారు. వీటిపై విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం



రైతులకు సూచనలిస్తున్న ఏపీఎం కవిత

పుల్లంపేట, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకమని ఏపీఎం కవిత పేర్కొన్నారు. పుల్లంపేట మండలం టి.బీజీపల్లెలో మంగళవారం జంగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ద్రవజీవామృతం తయారు విధానం, దాని ప్రయోజనంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ 20 సెంట్ల భూమిలో కూరగాయలు పండించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఏవో శ్రీధర్, సిబ్బంది సునీత, మస్తాన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: తమిళనాడులోని పెరంబదూర్‌లోని శాంసంగ్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధిత చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండు చేశారు. స్థానిక శాంసంగ్ షోరూం ఎదుట సీఐటీయూ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్మికుల హక్కులను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాంబాబు, తిరుపాల్, రమణ, నాగమ్మ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు అరకొరగా దరఖాస్తులు



ఎక్సైజ్ కార్యాలయంలో వివరాలు నమోదు చేయించుకుంటున్న దరఖాస్తుదారులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తుల విషయంలో మందకొడిగా సాగుతోందని ఎక్సైజ్ శాఖ రైల్వేకోడూరు సీఐ టి.తులసి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం దరఖాస్తుల ప్రక్రియను ఆమె పరిశీలించారు. మండల పరిధిలో 11, ఓబులవారిపల్లెలో నాలుగు, చిట్వేలి పరిధిలో నాలుగు కలిపి మొత్తం 19 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. మంగళవారం సాయంత్రానికి 70 దరఖాస్తులు మాత్రమే అందాయన్నారు. ఈ ప్రక్రియ బుధవారంతో ముగుస్తుందని, ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను, వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు.

మహానందిలో రాజంపేట ఎమ్మెల్యే పూజలు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి దంపతులు దైవదర్శనానికి వచ్చారు. కుటుంబ సమేతంగా కలిసి వచ్చిన వారు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వారిని యాగశాలలో ఏఈవో వై.మధు సత్కరించారు. వేదపండితులు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

రాయచోటిలో గంజాయి కలకలం

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలో మంగళవారం రాత్రి గంజాయి కలకలం రేపింది. పట్టణంలోని బంధ్ సెంటర్ సమీపంలోని నాయబ్‌రసూల్ వీధిలో గంజాయి పొట్లాలు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని గంజాయి కోసం గాలించారు. వీధిలో కంకర నింపిన సిమెంట్ సంచుల మధ్యన ఆరు గంజాయి పొట్లాలు దాచి ఉంచడాన్ని గుర్తించారు. పట్టణ సీఐ చంద్రశేఖర్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లే లోపే పట్టుకున్న వ్యక్తులను గుర్తు తెలియని వారు అదుపులోకి తీసుకున్నారని స్థానికులు చెబుతున్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రియాజ్‌బేగ్, పక్కన సిబ్బంది

రాయచోటి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి శుభ్రతపై ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రియాజ్‌బేగ్ పేర్కొన్నారు. పట్టణంలోని కె.రామాపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఆహారం, నీరు కలుషితం కావడంతో ఆహార నాణ్యత లోపిస్తోందన్నారు. రోజువారీ కార్యక్రమాలను యాప్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. సంబేపల్లె మండలం మొటుకువాండ్లపల్లిలో నిర్వహిస్తున్న 104 సేవలు ఆయన పరిశీలించారు. ఎంవో డాక్టర్ వసీమ్, సూపర్‌వైజర్లు నూర్జహాన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని వినతి



పురపాలక కమిషనర్ నాగేశ్వరరావుకి వినతిపత్రం అందజేస్తున్న వాలంటీర్లు, సీపీఐ నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఎన్డీయే కూటమి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్ డిమాండు చేశారు. సీపీఐ, వాలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పురపాలక కమిషనర్ నాగేశ్వరరావుకి వాలంటీర్లు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాలంటీర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన రూ.5 వేలు ఏమాత్రం సరిపోవని.. తాము అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు ఇస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తున్నా వాలంటీర్లు పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. వాలంటీర్ల సంఘ నాయకుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ



జేడీ గుణశేఖర్‌పిళ్లై

చిన్నమండెం, న్యూస్‌టుడే: జిల్లాలో గురువారం నుంచి జీవాల్లో (గొర్రెలు, మేకలు) నట్టల నివారణకు మందులు తాపే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ గుణశేఖరపిళ్లై తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి అన్ని ఆసుపత్రులకు మందులు పంపినట్లు వివరించారు. పశువైద్యులు, సహాయకులు ఇళ్ల దగ్గరకే వచ్చి జీవాలకు మందులు తాపిస్తారని, పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరాలతల్లీ... కటాక్షించమ్మా



రాజంపేట : కాత్యాయినిదేవి అలంకారంలో ఉదయగిరి ఎల్లమ్మ



గాయత్రీదేవి అలంకారంలో కె.రామాపురంలోని చౌడేశ్వరీ



పుల్లంపేటలో లక్ష్మీదేవి అలంకరణలో మారెమ్మ



చిట్వేలిలో లక్ష్మీదేవి అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి



లక్కిరెడ్డిపల్లె: సరస్వతి దేవి అలంకారంలో...



చిన్నమండెం : మోహినీ అలంకారంలో చౌడేశ్వరీదేవి



వెంకటరాజంపేట : శ్రీలలితాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



సుండుపల్లి: మహాలక్ష్మి అలంకారంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

దసరా ఉత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని పలు ఆలయాల్లో మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రైల్వేకోడూరులో గౌరీపూజ అలంకారంలో దర్శనమిచ్చారు. పలు చోట్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానాలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం



రైల్వేకోడూరులో ప్రత్యేక పూజల్లో చిన్నారులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తకోడూరు కాలనీ సమీపంలో నివాసముంటున్న మాచిరాజు కృష్ణంరాజు అనే వ్యక్తి ఇంట్లో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బాధితుడి భార్య ఆసుపత్రి పని మీద తిరుపతికి వెళ్లారు. ఆయన పట్టణంలోని తన ప్రింటింగ్ స్టేషనరీ దుకాణానికి వెళ్లారు. గమనించిన దుండగులు పట్టపగలే తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలు, అల్మారాలు గాలించి సుమారు రూ.40 లక్షల విలువ చేసే 50 తులాల బంగారు, రూ.50 వేల నగదు పట్టుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నామని సీఐ హేమసుందర్‌రావు ఆదివారం తెలిపారు.



బీరువాను చూపుతున్న బాధితుడు

హరియాణాలో భాజపా విజయంపై సంబరాలు

రాజంపేట, సుండుపల్లి, న్యూస్‌టుడే: హరియాణాలో భాజపా ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ విజయాన్ని సాధించడంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు ఎన్ని వాగ్దానాలు చేసినా, ఎన్ని ఆశలు చూపినా సుపరిపాలన అందించిన భాజపాకే ప్రజలు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిప్రసాద్, జి.కె.నాగరాజు, రమణ, సూర్యచంద్ర, సుబ్రహ్మణ్యంనాయుడు, నవీన్‌కుమార్ పాల్గొన్నారు. ● సుండుపల్లి కూడలిలో రాజంపేట నియోజకవర్గ కన్వీనరు టి.రాంజగదీష్‌స్వామి ఆధ్వర్యంలో కూడలిలో సంబరాలు చేసుకున్నారు.

రాజంపేట : హరియాణా ఎన్నికల్లో భాజపా అఖండ విజయాన్ని సాధించిందంటూ ఆ పార్టీ నాయకులు మంగళవారం స్థానిక పాతబస్టాండు కూడలిలో సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకుంటూ ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నాయకత్వంలో అద్భుత విజయాన్ని సాధించినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణా యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షబ్బీర్ అహమ్మద్, నరేంద్రరాజు, గుణవర్మ, పి.నాగేశ్వరరావు, సునీతనారాయణవర్మ పాల్గొన్నారు.



మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకుంటున్న భాజపా నాయకులు

వసతి గృహాల్లో సౌకర్యాలపై పరిశీలన



జి.కె.రాచపల్లి ఎస్సీ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సుండుపల్లి, ఎస్సీ, బీసీ, జి.కె.రాచపల్లిలోని ఎస్సీ వసతి గృహాలతో పాటు బాలికల వసతి గృహాన్ని రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి ప్రసూన మంగళవారం తనిఖీ చేశారు. గదులు, సరకు నిల్వ గదులు ఇతర వసతులను పరిశీలించారు. సుండుపల్లి పుల్లారెడ్డిగారిపల్లి సమీపంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల భవనాలు పరిశీలించారు. ఆమె వెంట ఎస్సీ వసతి గృహ సంక్షేమాధికారి రెడ్డెయ్య, హెడ్‌కానిస్టేబుల్ బి.డి.నాయక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మదనగోపాలపురం అభివృద్ధికి కృషి

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: మదనగోపాలపురం గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు తెలిపారు. రాజంపేట రూరల్ తెదేపా నేతలతో కలిసి ఆయన మదనగోపాలపురం గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తెదేపా మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు పాల్గొన్నారు.

నైతిక విలువలు అభ్యున్నతికి సోపానాలు

రాజంపేట, న్యూస్‌టుడే: ఒక వ్యక్తిలో ఉన్న నైతిక విలువలు అతని అభ్యున్నతికి సోపానాల్లా ఉంటాయని ఆధ్యాత్మికవేత్త గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో మంగళవారం 'విద్యార్థులు - నైతిక విలువలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదుటి వ్యక్తిని గౌరవించడం.. ఎదుటి వ్యక్తులు చెప్పే మంచి మాటలను శ్రద్ధగా వినడం, పెద్దలను గౌరవించడం వంటివే మన ఉన్నతికి దోహదపడుతాయన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వై.ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతి లేని రెండు టపాసుల దుకాణాలు జప్తు

రాజంపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని బండ్లవీధిలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న రెండు టపాసుల దుకాణాలను మంగళవారం పట్టణ పోలీసులు తనిఖీ చేశారు. లైసెన్స్ గడువు తీరిపోయినా రెన్యువల్ చేసుకోకుండా టపాసులు విక్రయిస్తున్నారని సీఐ యల్లమరాజు తెలిపారు. హరీష్ అనే వ్యక్తికి సంబంధించిన రూ.4 లక్షలు విలువ చేసే టపాసులను, సాగర్‌కృష్ణకు సంబంధించిన రూ.2.20 లక్షలు విలువజేసే టపాసులను జప్తు చేసినట్లు ఆయన చెప్పారు. వీరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



టపాసుల దుకాణాన్ని పరిశీలిస్తున్న పట్టణ పోలీసులు

పంచాయతీ కేంద్రం... వసతులు మృగ్యం



గాలివీడు-వేంపల్లె మార్గంలోని కొర్లకుంట పంచాయతీ బస్టాండు కూడలి ప్రాంతంలో సిమెంట్ రోడ్డును మట్టి కప్పేసింది. కస్పా ఎగువ ప్రాంతం నుంచి వర్షం నీరు ప్రవహించి సిమెంట్ రోడ్డుపై ఇసుక, మట్టి కుప్పలు ఏర్పడ్డాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించలేదు. ఇళ్ల నుంచి వెలువడే వృథా నీటితో పాటు వర్షం నీరు దారిపై ప్రవహిస్తోంది. ఈ విషయమై సర్పంచి పేరం మేనక మాట్లాడుతూ.. కొర్లకుంట బస్టాండు ప్రాంతంలో మట్టి కుప్పలు తొలగిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, గాలివీడు**

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నర్సుపల్లెలో నెలకొన్న తాగునీటి ఎద్దడి తీర్చేందుకు కొత్త బోరు బావి తవ్వకానికి మంగళవారం ఆయన శ్రీకారం చుట్టారు.

ట్రాక్టరు బోల్తా.. చోదకుడికి గాయాలు

పెనగలూరు, న్యూస్‌టుడే: పెనగలూరు చెరువు కట్టపై నుంచి ట్రాక్టర్ బోల్తా పడి చోదకుడు రెడ్డెయ్యకు గాయాలయ్యాయి. ఎన్ఆర్ పురంలో వరిగడ్డిని కట్టలు కట్టి తిరుగు ప్రయాణంలో మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్తుండగా పెనగలూరు చెరువు కట్టపై నుంచి ట్రాక్టర్ బోల్తా కొట్టి మడుగులోపడినట్లు స్థానికులు తెలిపారు.

తాగునీటి విషయమై ఘర్షణ

వీరబల్లి : కొత్తవడ్డెపల్లెలో ముగ్గురు కలిసి దాడి చేశారని బాధితుడు విశ్వనాథ్ ఫిర్యాదు చేశారని ఎస్సై మోహన్‌నాయక్ తెలిపారు. తాగునీటి విషయమై అదే గ్రామానికి చెందిన రామయ్య, ఆంజనేయులు, వెంకటలక్ష్మిలు దాడి చేసి కొట్టారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తే చర్యలు

సుండుపల్లి : గ్రామంలో శాంతిభద్రతల సమస్య సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్ స్పష్టం చేశారు. గ్రామంలో ఓ వర్గం చేస్తున్న ఆధిపత్య ధోరణిలపై మరోవర్గం వారు సీఐకి ఫిర్యాదుర చేయడంతో ఆయన గ్రామానికి వెళ్లి ఆరా తీశారు. స్థానికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనుల పరిశీలన

సుండుపల్లి : గ్రామీణ రక్షిత నీటి శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్తు నిధులతో చేపట్టి చెల్లింపులు జరిగిన 23 పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈ జాకోబ్ పాల్ పరిశీలన మంగళవారంతో ముగిసింది. నూతన బోర్ల తవ్వకం, మోటార్ల అమరిక, మోటార్ల మరమ్మతులకు సంబంధించి మాచిరెడ్డిగారిపల్లి, సొంతంవారిపల్లి, పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ పరిధిలో పరిశీలించారు. మండల ఏఈ ప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ విభాగ ఏఈలు కిరణ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

శిథిల భవనాలు... అద్దె గదుల్లో విధులు

ముళ్లపొదలతో నిండిన కార్యాలయాలు

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయం భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇంజినీర్లు, సిబ్బంది ఉండాల్సిన గదులు ముళ్లపొదల స్థావరంగా మారాయి. విధి లేని పరిస్థితిలో అద్దె భవనాల్లో జలాశయ కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. లోగడ జలాశయం నిర్మాణ సమయంలో డివిజన్, ఉప డివిజన్ల కార్యాయాలు సొంత భవనాల్లో నిర్వహించారు. ఇంజినీరు, సిబ్బంది అక్కడి నుంచి పనులను పర్యవేక్షించారు. అనంతరం జలాశయంలోని నీటి నిల్వలు లేనందున కార్యాలయాలు కడప నగరంలో ఏర్పాటు చేసుకుని విధులను నిర్వహించేవారు. గడిచిన నాలుగేళ్లుగా జలాశయంలో సమృద్ధిగా నీటి నిల్వలు పెరిగాయి. ● జిల్లాల విభజనలో జిల్లా కేంద్రంగా రాయచోటిని ఎంపిక చేశాక జలాశయాన్ని పర్యవేక్షించడానికి స్థానికంగా కార్యాలయాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. గాలివీడులో 10 ఎకరాల్లో తారురోడ్లు, భవనాలు విస్తరించి ఉన్నా డివిజన్, ఉప డివిజన్ కార్యాలయాల భవనాలు శిథిలం కావడంతో సొంత భవనాల్లో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది అద్దె గదులకు పరిమితమయ్యారు. దీంతో కొన్నాళ్లకు ప్రాజెక్టు భవనాలను కంపచెట్లు కప్పేశాయి. తలుపులు, కిటికీలకు చెదలు సైతం పట్టాయి. గదులోకి వెళ్లడానికి భయపడే విధంగా శిథిలావస్థకు చేరాయి. ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు ఎక్కడ అందుబాటులో ఉన్నారో తెలియక ఆయకట్టుదారులు, నిర్వాసితులు అవస్థలు పడతున్నారు. జలాశయం భవనాలను మరమ్మతులు చేయించి ఇంజినీర్ల కార్యాలయాలు ఏర్పాటు చేసి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని రైతులు డిమాండు చేస్తున్నారు. ఈ విషయమై డీఈఈ బి.శిరీష్‌కుమార్ మాట్లాడుతూ.. క్వార్టర్స్, కార్యాలయాల భవనాల మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. అద్దె భవనాల్లో ప్రస్తుతం కార్యాలయాలు నిర్వహిస్తున్నామన్నారు. అనుమతి రాగానే భవనాల మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.



ముళ్లపొదల్లో వెలిగల్లు జలాశయం కార్యాలయం భవనాల దుస్థితి

